రైతుబంధు వద్దన్న కాంగ్రెస్‌కు ఓటు బంద్ పెట్టాలె

● ఎమ్మెల్యే నోముల భగత్

హాలియా, అక్టోబర్ 27 : శాసనసభ ఎన్నికలు పూర్తయ్యే వరకు రైతుబంధు ఆపాలంటూ కాంగ్రెస్ పార్టీ నాయకులు కేంద్ర ఎన్నికల సంఘానికి వినతిపత్రం అందించడం సిగ్గుచేటని, పంట పెట్టుబడి డబ్బులను అడ్డుకున్న కాంగ్రెస్‌కు రైతులు ఓటు బంద్ పెట్టాలని నాగార్జునసాగర్ ఎమ్మెల్యే నోముల భగత్‌కుమార్ పిలుపునిచ్చారు. శుక్రవారం హాలియా క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ట్రైకార్ చైర్మన్ ఇస్లావత్ రాంచందర్‌నాయక్‌తో కలిసి మాట్లాడారు. రైతు సంక్షేమమే ధ్యేయంగా సీఎం కేసీఆర్ రైతుబంధు పథకాన్ని అమలు చేస్తున్నారన్నారు. రైతులు పంట పెట్టుబడికి అప్పులు చేయకూడనే ప్రతి సంవత్సరం వానకాలం, యాసంగి సీజన్‌లో రాష్ట్ర ప్రభుత్వం ఎకరానికి రూ.5 వేల చొప్పున రైతుల ఖాతాల్లో నగదును జమచేస్తున్నదని చెప్పారు. ఎప్పటిలాగే ఈ ఏడాది యాసంగి సీజన్ రైతుబంధు నిధులను రైతుల ఖాతాల్లో జమ చేస్తుంటే వాటిని ఆపేందుకు కాంగ్రెస్ నాయకులు ప్రయత్నిస్తున్నారని పేర్కొన్నారు. దీనిని బట్టి కాంగ్రెస్ ముమ్మాటికి రైతువ్యతిరేక పార్టీ అని నిరూపితమైందన్నారు. గతంలో వ్యవసాయానికి 3 గంటట విద్యుత్ చాలని చెప్పిన వారు ఇప్పుడు రైతుబంధును అడ్డుకుంటున్నారని.. రాబోయే ఎన్నికల్లో ఆ పార్టీని రైతులు బొంద పెట్టాలని పిలుపునిచ్చారు. గ్రామ గ్రామాన కాంగ్రెస్ నాయకుల దిష్టిబొమ్మలు దహనం చేయాలన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ కాంగ్రెస్ పార్టీ నాయకులు బీఆర్ఎస్ నాయకులను ప్రలోభాలకు గురి చేస్తున్నారని, ప్రలోభాలకు లొంగితే మళ్లీ వ్యవసాయానికి కష్టకాలం మొదలవుతుందని హెచ్చరించారు. బీఆర్ఎస్ విజయాన్ని అడ్డుకోలేరు వచ్చే శాసన సభ ఎన్నికల్లో రాష్ట్రంలో, నాగార్జునసాగర్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ గెలుపును ఎవరూ అడ్డుకోలేరని ట్రైకార్ చైర్మన్ ఇస్లావత్ రాంచందర్‌నాయక్ అన్నారు. సీఎం కేసీఆర్ రాష్ట్రంలో అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలే ఎమ్మెల్యే నోముల భగత్‌కుమార్ విజయానికి నాంది అవుతాయన్నారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ అభివృద్ధి చేసే భగత్ లాంటి నాయకుడు కావాలో హైదరాబాద్‌లో ఉంటూ ప్రజలకు అందుబాటులో ఉండని కాంగ్రెస్ నాయకులు కావాలో ప్రజలే ఆలోచించాలన్నారు. సమావేశంలో హాలియా, నిడమనూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్లు జవ్వాజి వెంకటేశం, మర్ల చంద్రారెడ్డి, నిడమనూరు ఎంపీపీ సలహాదారుడు బొల్లం రవి, బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి ఎన్నమల్ల సత్యం, ఉన్నం భాస్కర్, ఎంపీటీసీలు సంతోష్, భాస్కర్, ముప్పారం దేవాలయ చైర్మన్ లింగప్ప, సైదులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లో చేరికలు

హాలియా : నాగార్జునసాగర్ నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి, సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై నిడమనూరు మండలం ముప్పారం, వెంగన్నగూడెం గ్రామాలకు చెందిన 80 కాంగ్రెస్ పార్టీ కుటుంబాలు శుక్రవారం హాలియాలో ఎమ్మెల్యే నోముల భగత్‌కుమార్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వీరికి ఎమ్మెల్యే గులాబీ కండువాలు కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ పాలనలోనే నాగార్జునసాగర్ నియోజకవర్గం అభివృద్ధి చెందిందన్నారు. బీఆర్ఎస్ మ్యానిఫెస్టోలోని అంశాలను కార్యకర్తలు ప్రజలకు వివరించి, నాగార్జునసాగర్‌లో గులాబీ జెండా ఎగిరేలా కార్యకర్తలు కృషి చేయాలని కోరారు.

బీఆర్ఎస్‌లో చేరిన వారితో ఎమ్మెల్యే నోముల భగత్, ట్రైకార్ చైర్మన్ రాంచందర్‌నాయక్

ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించాలి

● ఆర్ఓ శ్రీనివాస్

నిడమనూరులో శిక్షణ ఇస్తున్న అధికారులు

నిడమనూరు, అక్టోబర్ 27 : ఎన్నికల అధికారులకు ఇస్తున్న శిక్షణను సద్వినియోగం చేసుకొని వచ్చే నెలలో జరిగే శాసన సభ ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించాలని నాగార్జునసాగర్ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్ సూచించారు. మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో శుక్రవారం ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులకు ఏర్పాటు చేసిన శిక్షణ తరగతులను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఎన్నికల నిర్వహణపై అధికారులు అవగాహన పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ పీడీ రాజ్‌కుమార్, డీఈఓ భిక్షపతి, తాసీల్దార్ జంగాల కృష్ణయ్య, నోడల్ అధికారి తరి రాము, ఏఎల్ఎంటీ జాన్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రిసైడింగ్ అధికారి సస్పెన్షన్

నిడమనూరు, అక్టోబర్ 27 : మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో నిర్వహిస్తున్న పీఓ, ఏపీఓల శిక్షణ కార్యక్రమంలో అధికారుల పట్ల అనుచితంగా ప్రవర్తించిన ప్రిసైడింగ్ అధికారి రమావత్ లాలూను డీఈఓ సస్పెండ్ చేశారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలపై డీఈఓ బొల్లారం భిక్షపతి పీఓ (నిడమనూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల స్కూల్ అసిస్టెంట్) రమావత్ లాలూను ప్రశ్నించారు. దానికి ఆయన నిర్లక్ష్యంగా సమాధానమివ్వడంతో పాటు అధికారి పట్ల అనుచితంగా ప్రవర్తించారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడమే కాకుండా అధికారుల పట్ల అనుచితంగా ప్రవర్తించిన లాలూను సస్పెండ్ చేస్తూ డీఈఓ ఉత్తర్వులు జారీ చేశారు.

సభలో అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే నోముల భగత్, ఎమ్మెల్సీ కోటిరెడ్డి, కార్పొరేషన్ చైర్మన్లు రాంచందర్‌నాయక్, పల్లె రవికుమార్, నాయకులు

రెండున్నరేండ్లలోనే 70 ఏండ్ల అభివృద్ధి

- మరోసారి ఆశీర్వదించండి.. మరింత అభివృద్ధి చేస్తా
- గతంలో అభివృద్ధిని పట్టించుకోని వారు మరోసారి ప్రజలను మభ్య పెడుతున్నరు
- ఎమ్మెల్యే నోముల భగత్‌కుమార్
- గుర్రంపోడు ప్రజా ఆశీర్వాద సభకు భారీగా తరలివచ్చిన ప్రజలు
- నిత్యం ప్రజలకు అందుబాటులో ఉన్న నాయకుడినే ఎన్నుకోవాలి : ఎమ్మెల్సీ కోటిరెడ్డి

గుర్రంపోడు, అక్టోబర్ 27: 70 ఏండ్లుగా వెనుకబడి ఉన్న నాగార్జునసాగర్ నియోజకవర్గాన్ని తాను ఎమ్మెల్యేగా గెలుపొందాక సీఎం కేసీఆర్ సారథ్యంలో రెండున్నరేండ్లలోనే అభివృద్ధి చేసినట్లు ఎమ్మెల్యే నోముల భగత్‌కుమార్ అన్నారు. వచ్చే శాసన సభ ఎన్నికల్లో మరోసారి తనను ఆశీర్వదిస్తే మరింత అభివృద్ధి చేస్తానన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ప్రజా ఆశీర్వాద సభలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. గడిచిన రెండున్నరేండ్ల కాలంలో సీఎం కేసీఆర్ ఆశీస్సులు, మంత్రులు కేటీఆర్, జగదీశ్‌రెడ్డి, ఎమ్మెల్సీ కోటిరెడ్డి సహకారంతో గుర్రంపోడు మండలంలో రూ. 54 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టినట్లు ఎమ్మెల్యే చెప్పారు. ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ తెలంగాణను అన్ని రంగాల్లో వెనుకబాటుకు గురి చేసిందని.. స్వరాష్ట్రంలో సీఎం కేసీఆర్ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్లారన్నారు. గతంలో సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీలన్నీ అమలు చేశారని.. ప్రస్తుతం మ్యానిఫెస్టోలో ప్రకటించినవన్నీ రాబోయే రోజుల్లో అమలు చేస్తారన్నారు. రూ. 400కే గ్యాస్ సిలిండర్‌తో పాటు రేషన్ కార్డు దారులందరికీ సన్న బియ్యం ఇవ్వనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం రైతుబంధు ద్వారా ఎకరానికి రూ. 10 వేలు ఇస్తుండగా దానిని రూ. 16 వేలకు పెంచనున్నట్లు పేర్కొన్నారు. ప్రతి కుటుంబానికి కేసీఆర్ భరోసా పేరుతో బీమా అందిస్తామని, దాంతో పాటు ప్రస్తుతం ఇస్తున్న ఆసరా పింఛన్‌ను కూడా పెంచనున్నట్లు చెప్పారు. ఇదే విషయాన్ని ప్రజలు రేపటి నుంచి గ్రామాలకు చర్చ పెట్టాలన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటైన పదేండ్లలోనే సీఎం కేసీఆర్ అనేక పథకాలు అమలు చేశారన్నారు. గతంలో కరెంటు కోతలు ఉండగా ఇప్పుడు 24 గంటల నాణ్యమైన విద్యుత్ వచ్చిందని, కంటి వెలుగు ద్వారా ప్రతి ఒక్కరికీ కంటి పరీక్షలు ఉచితంగా నిర్వహించి అద్దాలు అందించారని, రైతుబంధు, రైతుబీమా, సాగు నీరు, ఉచిత విద్యుత్, దళితబంధు, కల్యాణలక్ష్మి, షాదీముబారక్, ఆసరా పింఛన్లు, గృహలక్ష్మి, మిషన్ భగీరథ ఇలా అనేక పథకాలు పేదలకోసం రూపొందించి అమలు చేసిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందన్నారు. మరి 64 ఏండ్లు రాష్ట్రాన్ని పాలించిన కాంగ్రెస్ ఇలాంటి ఒక్క సంక్షేమ పథకమైనా అమలు చేసిందా ప్రజలకు చెప్పాలన్నారు. తెలంగాణలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశంలోనే ఏ రాష్ట్రంలో లేవన్నారు. ఈ విషయాలన్నీ ప్రజలు చర్చపెట్టాలన్నారు. ప్రస్తుతం బరిలో ఉన్న అభ్యర్థుల గురించి కూడా చర్చ పెట్టాలన్నారు. నవంబర్ 30వ తేదీ సాయంత్రం ఐదు గంటల వరకు మీరందరూ నిద్రపోకుండా ప్రజలను చైతన్య పర్చి కారు గుర్తుకు ఓటేసి గెలిపించేలా చూడాలని పిలుపునిచ్చారు. రాబోయే ఎన్నికల్లో తనను మరోసారి ఆశీర్వదించి భారీ మెజార్టీతో గెలిపిస్తే ఐదేండ్లు ప్రజల మధ్యే ఉంటూ ప్రభుత్వ పథకాలు అందేలా చూస్తానన్నారు.

భగత్ గెలుపు ఖాయం : ఎమ్మెల్సీ

రాబోయే ఎన్నికల్లో ఎమ్మెల్యే నోముల భగత్ భారీ మెజార్టీతో గెలుపొందడం ఖాయమని ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి అన్నారు. కాంగ్రెస్ నాయకులు గుర్రంపోడులో హడావిడి చేసి ప్రజలను మరోసారి మోసం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని.. కానీ ప్రజలంతా బీఆర్ఎస్ వైపు ఉన్నారన్నారు. సీఎం కేసీఆర్ పాలనలోనే నాగార్జునసాగర్ నియోజకవర్గం అభివృద్ధి చెందిందని, ఎవరెన్ని అసత్యాలు ప్రచారం చేసినా బీఆర్ఎస్ గెలుపును అడ్డుకోలేరన్నారు. రైతుల కోసం అనేక పథకాలు అమలు చేస్తూ వ్యవసాయ రంగాన్ని లాభదాయకంగా మార్చిన ఘనత సీఎం కేసీఆర్‌దే అన్నారు. రైతు బంధు, రైతు బీమా ఇస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ మాత్రమే అన్నారు. రైతులందరూ సీఎం కేసీఆర్ పక్షానే ఉన్నారన్నారు. ఎన్నికలప్పుడు వచ్చి హడావిడి చేస్తున్న కాంగ్రెస్ పార్టీకి ఎందుకు ఓటు వేయాలో, ఆ పార్టీ చేసిన అభివృద్ధి ఏమిటో ఆ పార్టీ నాయకులను ప్రజలు ప్రశ్నించాలన్నారు. నాగార్జున సాగర్‌లో ఎమ్మెల్యేగా నోముల భగత్‌ను గెలిపించి సీఎం కేసీఆర్‌కు కానుకగా ఇవ్వాలని పిలుపునిచ్చారు.

ట్రైకార్ చైర్మన్ ఇస్లావత్ రాంచందర్‌నాయక్ మాట్లాడుతూ జానారెడ్డి 35 ఏండ్లు ఎమ్మెల్యేగా, 16 ఏండ్లు మంత్రిగా ఉండి ఈ ప్రాంతంలోని పేద విద్యార్థులు చదువుకునేందుకు ఒక్క ప్రభుత్వ డిగ్రీ కళాశాల కూడ తీసుకురాలేని, రెండున్నరేండ్లలోనే నియోజకవర్గానికి ప్రభుత్వ డిగ్రీ కళాశాలతో పాటు నెల్లికల్లు లిఫ్టును తీసుకొచ్చిన ఘనత ఎమ్మెల్యే నోముల భగత్‌దే అన్నారు. రైతుబంధు ఇచ్చిన సీఎం కేసీఆర్‌కు ఓటేస్తారా..రైతుబంధును నిలుపుదల చేసిన కాంగ్రెస్ పార్టీకి ఓటేస్తారా అనేది ప్రజలే నిర్ణయించాలన్నారు. రాష్ట్ర కల్లుగీత కార్పొరేషన్ చైర్మన్ పల్లె రవి కుమార్‌గౌడ్ మాట్లాడుతూ రాష్ట్రంలో పేదల జీవితాల్లో వెలుగులు నింపడంతో పాటు రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకుపోతున్న ఘనత సీఎం కేసీఆర్‌దే అన్నారు. కార్యకర్తలంతా ఐక్యంగా ఉండి నోముల భగత్‌ను గెలిపించాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు గుత్తా అమిత్‌రెడ్డి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు కడారి అంజయ్యయాదవ్, జడ్పీ వైస్ చైర్మన్ ఇరిగి పెద్దులు, ఎంపీపీ మంచికంటి వెంకటేశ్వర్లు, వైస్ ఎంపీపీ వజ్జ రామేశ్వరీధనుంజయ్, పార్టీ అధ్యక్ష కార్యదర్శులు గజ్జెల చెన్నారెడ్డి, రామగిరి చంద్రశేఖర్‌రావు, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌కే ప్రజల ఆశీర్వాదం

● జనసంద్రమైన గుర్రంపోడు

హాలియా : గుర్రంపోడు మండల కేంద్రంలో నిర్వహించిన బీఆర్ఎస్ పార్టీ ప్రజాఆశీర్వాద సభకు ప్రజలు పోటెత్తారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి 15 నుంచి 20 వేల మంది ప్రజలు తరలిరావడంతో మండల కేంద్రం జనసంద్రమైనది. కట్టవారిగూడెం విఘ్నేశ్వర రైస్‌మిల్లు నుంచి గుర్రంపోడు మండల కేంద్రం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. దాంతో నల్లగొండ- దేవరకొండ జాతీయ రహదారిపై కిలోమీటరున్నర ప్రజలతో కిక్కిరిసి పోయింది. ఈ సభ బీఆర్ఎస్ శ్రేణుల్లో జోష్ నింపింది. నాయకులు పార్టీలు మారితేనేమి జనం మాత్రం అభివృద్ధి వెంటే ఉన్నారని, వారంతా సీఎం కేసీఆర్ నాయకత్వాన్నే కోరుకుంటున్నారని ఈ సభ రుజువు చేసింది. నాగార్జున సాగర్ నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులంతా ఒకే వేదిక మీదికి రావడంతో కార్యకర్తల్లో నూతనోత్సాహం నింపింది.

ఆశీర్వాద సభకు హాజరైన ప్రజలు

600 మంది బీఆర్ఎస్‌లో చేరిక

రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమానికి ఆకర్షితులై కాంగ్రెస్ పార్టీకి చెందిన 600 మంది నాయకులు, కార్యకర్తలు శుక్రవారం ప్రజాఆశీర్వాద సభలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి ఎమ్మెల్యే నోముల భగత్‌కుమార్ గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.